# పిండం

గోదావరి నిండుగా... నిశ్శబ్దంగా పారుతుంది.

ఇసుకలో కూచుండి... జనుపతాడు రెండు చివర్లకూ రెండు రేడియో సౌండ్ బాక్స్‌ల అయస్కాంతాలు కట్టి గట్టిగా దూముడేసిండు తొమ్మిదేళ్ల సాగర్‌గాడు... వానితో పాటు రమేషు, తిరుపతి, సరోజన మధుగాడు, పుష్ప, శీనుగాడు...

టాటా సుమోల్ల, జీపుల్ల, కార్లల్ల, బస్సుల్ల వచ్చేటోల్లతోని రద్దీ మెల్లగా పెరుగుతంది. బావండ్లు వాళ్లకు ఎదురుపడి పూజలకోసం ఆగమాగమైతంర్రు... కొందరు పెద్దలకు పిండాలు పెడ్తుంర్రు...

శీనుగాడు అయస్కాంతాల జనుపతాడు నడుంకు కట్టుకొని గోదాట్ల దునికిండు. అటూ ఇటూ నీళ్లల్ల నడిచి... జనుపతాడు బయటకు లావట్టిండు... ఒక అయస్కాంతానికి రెండు రూపాయి బిల్లలు అతుక్కున్నయ్...

ఆనందంగా 'ఏ... రెంర్రూపాయలో' అని అరిచిండు. మిగితా పిల్లలంతా తాళ్లు పట్టుకొని గోదాట్ల దునికింర్రు... సాగర్‌గాని తాడు తెగిపోయినకొద్దీ. ముల్లేసిండు... చివరికి తాడు నడుంకు కట్టుకొని గోదాట్ల దునికిండు.

గోదారి వొడ్డున మంత్రాల ఘోష... పసుపుకుంకాలు కల్సిపోయిన రంగు రంగుల ఇసుక... అగరువత్తుల పల్చటి వాసన....

సాగర్ గానికి జ్వరంగా వుంది... కడుపులకెల్లి చలొస్తంది... అయినా తప్పది... ఇయ్యాల్ల కనీసం యాభై రూపాయి బిల్లలన్నా అయస్కాంతానికి చిక్కాలె... అవ్వకు దగ్గు టానీకు కొనుక్కుపోవాలె అనుకున్నడు.

ఆశగా అయస్కాంతాల్ని బయటికి తీసిండు... మూడు చారాన బిల్లలు అతుక్కున్నయ్... వాడి చిన్ని గుండె కలుక్కుమంది... నిన్న గిట్లనే ఆటాన, రూపాయి బిళ్లల్తోని... నలుభైరెండు చారాన బిళ్లలు చిక్కినయ్... ఏం లాభం... చారాన బిళ్లలు చెల్లుతలేవంటుంర్రు... ఎవ్వలు తీస్కుంటలేరు... అదే గోదాట్ల ఇసిరేసిండు...

అవిగాక నిన్న ముప్పయి రూపాయిలదాకా చిక్కినయి... మొన్న ఇరువై... అవలి మొన్న పన్నెండు రూపాయలు... రోజంత నీళ్ళల్ల నానాలె... పైసలు ఇసిరేటోల్ల

దిక్కు ఆశగ చూడాలె... ఎవలన్న పైసలిసిరెయ్యంగనే తిరుపతి మధుగాడు, పుష్ప, శీనుగాడు, సరోజన అందరు అటుదిక్కు అయస్కాంతాలు ఇసిరి గెలికిత్తరు... తాడు బయటికి తియ్యంగ ఆశ... ఎవలకు చిక్కుతదోనని. పుష్పనైతే దేవుడా... దేవుడా అనుకుంట తాడు ఇగ్గుతది. కాని... దానికెప్పుడు పైసలతుక్కోవు. అందరు నవ్వుతరు. ఓపారి పుష్పకి రోజంత నీళ్లల్ల తిరిగినా రెండు రూపాయి బిల్లలే దొరికినయి... ఏడిస్తే సాగర్‌గాడే అయిదు రూపాయలిచ్చిండు. 'నాకు బాగ దొరికినప్పుడు నీకిస్తా' అన్నది. మిగితావోల్లంతా దొరికిన పైసల్తోని ఏవేవో కొనుక్క తింటరు. పుష్పనేమో వాళ్లమ్మకిస్తది... సాగర్‌గాడు వాళ్లవ్వకు మందులు కొంటడు.

జనం పెరుగుతున్నరు... నిండ మునుగుతున్నరు...

బావండ్ల మంత్రాలు పోటీపడి వినస్తన్నయ్...

పిండాలు పెట్టాలనుకునేటోల్లకు... అన్ని సామాన్లు బావండ్లే సమకూరుస్తుండ్రు. పిండాలు నీళ్లల్ల విడిచినంక... కాళ్లకు దండం పెట్టిచ్చుకొని నూట పదార్ల కాన్నించి వెయ్యినూట పదార్లదాక వసూలు జేత్తండ్రు...

వాళ్లు కూడా సంతోషంగ ఇస్తుండ్రు...

సాగర్‌గాడు అన్నీ మర్చిపోయి... వాళ్లనే బీరిపోయి చూస్తుంటడు. వాడికెంతకీ అర్థంకాదు. వొడ్డున వాళ్లు... నీళ్లల్లో తాము... అయినా ఎంత తేడా అనుకుంటడు.

బావండ్ల మంత్రాలు ఎన్నిసార్ల విన్నా అర్థంకావు... అందరి బావండ్లకూ పరిచయమే. రాత్రికాంగనే చిల్లర పైసలన్నీ తీసుకొని నోట్లు ఇస్తరు.

ఓపారి రామేశ్వరం పంతుల్ని అడిగిండు.

"అయ్యా.. గట్ల కూసోవెట్టి పిండితోని ముద్దచేసి మంత్రాలు పాడి నీళ్లల్ల వేస్తుంర్రు కదా... ఏంటిదదీ?" అని.

"మీలాంటోల్లకెందుకురా... అయినా వాటిని శ్రాద్ధకర్మలంటారు. చనిపోయిన వాళ్లకి అలా పిండప్రధానం చేస్తే మంచిది" అని చెప్పిండు.

సాగర్‌గాడికి చప్పున వాళ్లమ్మ, నాన్న యాదికచ్చింర్రు.

"మా బాపు అమ్మకూడా చచ్చిపోయింర్రయ్య గారూ... మరి నేను పిండాలు పెట్టుకోవచ్చా.." అనడిగిండు. రామేశ్వరం పంతులు నవ్వి

"నీకెందుకురా... కనీసం రెండు వందలన్నా ఖర్చవుతుంది తెల్సా" అన్నడు. సాగర్‌గాడు నీరుకారిపోయిండు... రెండు వందలే... ఆ పైసలుంటే కనీసం అవ్వకు మందుగోళీలకన్నా పనికస్తయి అనుకున్నడు.

కాని... పుష్కరాలప్పుడైతే వందలాది మంది పిండ ప్రదానాలు చేస్తుంటే... వాడికీ అమ్మా నాన్న గుర్తొచ్చేవాళ్లు... ఒక్కసారన్న వాళ్లకోసం పిండాలు విడువాలి... అన్న కోర్కె రోజురోజుకీ బలంగా పెరుగుతుంది.

"నీయవ్వ... రోజు మంత్రాలు వినీవినీ నోటికచ్చినయ్. ఈ అయ్యగార్కి రెండు వందలిచ్చుడేంది... మా ఇంట్ల పెట్టుకుంట నేనే మంత్రాలు సదువుకుంట" అనుకున్నడు.

"రేయ్ సాగర్‌గా... నీ ముందట పైసల్ పడ్డయిరా. అయస్కాంతం ఇసురు" అని అరిచింది పుష్ప.

అప్పటికే చలిజ్వరం బాగ వచ్చింది... దవడలు కొట్టుకుంటున్నయ్...

మంచు గడ్డల పెట్టినట్టయితంది... వొడ్డుకు వచ్చి కూసున్నడు గజగజ వణుక్కుంటూ...

నీళ్లల్లకు దిగలేని నర్సవ్వ, గంగవ్వ, మొగిలి తాత ఇంకొందరు ముసలోల్లు కట్టె పుల్లల్తోని ఇసుకను తవ్వుతండ్రు... ఇసుకల కూరుకుపోయిన రూపాయి బిల్లలు దొరుకతయని... కొన్ని దొరికినయ్...

సాగర్‌గాడు నిక్కరు జేబు చూసుకున్నడు... దొరికిన మూడు రూపాయలే తగిలినయి. అవ్వ యాదికచ్చింది... దగ్గు యాదికచ్చింది... టానీకు సీసా, యాభై రూపాయలు యాదికచ్చినయి...

మల్ల నీళ్లల్ల దునికిండు....

ఎంత దేవులాడినా ఆటాన రూపాయి బిల్లలే... రూపాయి బిల్లలు కొన్ని స్టీల్‌వి అతుక్కుంటలేవు. మల్ల నీళ్లల్లనే జారిపడుతున్నయి. బుడుంగన మునిగి దొరుకవట్టిండు. ఒక్క అయిదు రూపాయల బిల్ల అతుక్కున్నది.

"ఎవలో ... ధర్మాత్ముడు" కండ్లకద్దుకొని నిక్కరు జేబుల వేసుకున్నడు. కడుపులకెల్లి చలి ఎక్కెక్కి వస్తుంది. నీళ్లల్ల కూడా నిప్పులెక్క పెయ్యి మండుతంది...

అయినా వాడు... అయస్కాంతాల్ని విసుర్తూనే వున్నాడు.

xxx xxx xxx

"అయోధ్యా మధురా మాయా
కాశీ కంచి అవంతిక
పురిద్వారే వతాచైవ
సత్పయితే మోక్షదాయకే....

సవ్యం... అపసవ్యం..." అంటూ పంచెని భుజమీమ్మదికెల్లి మార్చు కుంటుంటే... మంచంలకెల్లి లింగవ్వ దగ్గుకుంటనే నవ్వింది. తల్లి తండ్రి ఫోటోల ముందు కూసోని సాగర్‌గాడు పిండ ప్రధానం చేస్తుండు.

"ఏందిరా పోడా... రోజు గోదార్ల ఈదుకుంట బావండ్ల మంత్రాలన్ని నేర్సినవ్... ఉశారోనివే...." అన్నది.

"ఆగే అవ్వా... ఇంకా త్రుప్యతి త్రుప్యతి అనాలె... మూడు పిండాల్లల్ల మీ అవ్వపేరు, తాతపేరు కూడా చెప్పు.. చదువాలె" అన్నడు.

అవ్వ గుండె తడారింది...

"పిండం పెట్టుడు అంటె చచ్చిపోయినోల్లను యాజ్జేసుకునుడు బిడ్డా... రేపు కొయ్యూరు పోదాం... అక్కడ రేపు మీ అమ్మకు బాపుకు పిండాలు పెడ్తుండ్రు" అన్నది కండ్లనీళ్లతోని...

సాగర్‌గాని మొకం వెలిగిపోయింది...

"నిజంగనానే అవ్వా..." అన్నడు దగరికచ్చి...

"అవ్‌బిడ్డా... రేపే పొద్దుగాల పోదాం" అన్నది. ఆ రాత్రి వాడికి నిద్రపట్టలేదు. ఎప్పుడు తెల్లార్తదా అన్నటు చూసిండు. జ్వరం జజ్జెరభూతంగ వచ్చింది... అయినా లెక్కచెయ్యలేదు.

తెల్లారింది...

కొయ్యూరు పొలిమేర్లకు పోంగనే... మస్తుమంది కనవడ్డరు. అందరు దప్పుల్తోని ఎగుర్తండ్రు... పాటలు పాడ్తండ్రు... అందరి చేతుల్ల ఎర్రజెండాలు...

వీళ్లకు ఎదురచ్చి అవ్వ చేతుల్ల అమ్మ బాపు ఫోటో పెట్టిండ్రు... ఒకాయినె సాగర్‌గాన్ని ముద్దుపెట్టుకున్నడు. 'ఇగనడువుండ్రి' అన్నడు.

జనం కదిలింది... గోదారి వొడ్డుకన్నా ఎక్కువ జనం.. దప్పులు... పాటలు... డ్యాన్సులు... నినాదాలు...

అందరి మధ్య అవ్వ... అవ్వ చెయ్యిపట్టుకొని సాగర్‌గాడు... గంటసేపు నడిసిండ్రు... ఊరేగింపు ఒకచోట ఆగింది...

అవ్వ చేతుల్లోని ఫోటో గద్దెమీద పెట్టిచ్చిండ్రు... ఎత్తు స్థంబంమీద కప్పిన గొంగడిని ఇగ్గుమన్నరు.

అవ్వ గొంగడి ఇగ్గింది...

దప్పులు పగిలేటట్టు మోగినయ్... పాటలు హోరెత్తినయ్...

అవ్వ కండ్లనీళ్లతోని సాగర్‌గాన్ని దగ్గర తీసుకుంది...

"దండం పెట్టు బిడ్డా... గిప్పేమనకు పుష్కరాల లెక్క.... గోధుమ పిండితోని చేసిన పిండం... నీళ్లల్ల కరిగిపోతది. మీ అమ్మబాపు కోసం.... సిమెంటుతోని చేసిన పిండంరా ఇది... వాళ్ల పిండాలది తెల్లరంగు... మనది ఎర్రరంగు... వాళ్లు నీళ్లల్ల విడిచిపెడ్తరు... మనం ఆకాశంల నిలబెడ్తం..." అన్నది.

వాడు తలెత్తి చూసిండు...

ఆకాశాన్ని తాకుతున్న స్థూపం...

వాడి కళ్లల్లో ఆనందంగా పరువల్ల గోదారి దూకింది... జ్వరం దెబ్బకు జారింది.

రెండు చేతులెత్తి దండం పెట్టిండు...

మంత్రాల్లెక్క గాదు... వాడికిప్పుడు అక్కడి పాటలూ అర్థమైపోతున్నయ్.!!